
- తులసి బాలకృష్ణ



# దహన సంస్కారం

అరిచ్చంద్రుడి గుండెలు ఆందోళనతో అదిరిపడ్తున్నాయి.

దుర్గి భయంతో బెంబేలెత్తిపోతోంది.

విష జ్వరంతో కాలిపోతూ, అపస్మారక స్థితిలో వ్రేళ్లాడిపోతూన్న మూడేళ్ల కొడుకు వాళ్ల చేతుల్లో వున్నాడు.

ఇహనో ఇప్పుడో రాబోయే, విభూతి బ్రహ్మచారి మహరాజ్ బాబాకోసం, ఆయన స్వహస్తాలతో మంత్రించి ప్రసాదించబోయే విభూతికోసం వాళ్ల చూపులు కొస ఆశతో ఎదురుచూస్తూన్నాయి. ఆ విభూతే తమ కొడుక్కి ప్రాణదాయిని.

బాబాగారు రావడానికింకా టైముస్నట్టుగా వుంది.

ఆలస్యమవుతున్నకొద్దీ దంపతుల గుండెల్లో గాభరా ఎక్కువ అవుతోంది. క్షీణించిపోతూన్న కొడుకు వైపు, రాబోయే బాబాగారి ఆశ్రమ ద్వారంవైపు పదేపదే మార్చి చూస్తున్నారు.

ఎవరో రాజకీయ నాయకులు ముగ్గురు యిప్పుడే వచ్చారు.

ఎంతోమంది ఖరీదయిన వ్యక్తులు కార్లలో, స్కూటర్లలో వస్తూనే వున్నారు.


జనం ఎక్కువ అవుతూన్నకొద్దీ, వాళ్లకి ముందు జాగా వదుల్తూ వెనక్కి జరగడంతో బాబాగారు అధిరోహించబోయే వేదికకి దూరం క్రమేపీ పెరుగుతూనే వుంది.

పట్టణం చివరన గత పదిహేను రోజుల క్రితమే వెలిసిన బాబాగారి ఆశ్రమం ముందు వారి దర్శనంకోసం, వారి చేతుల మీదుగా సర్వరోగ నివారణిగా కొనియాడబడుతూన్న విభూతిని అందుకోవడంకోసం అందరూ రకరకాలయిన ముడుపులతో వేచి వున్నారు.

''సాలా బయంగా వుంది. బుడ్డోడు బతుకుతాడంటావా?'' దిగులు వెళ్లగక్కుతూ ప్రశ్నించింది దుర్గి.

''సూద్దూరీ. ''బాబాగారు దయతల్సి యిాబూదిత్తే యీడు గ్యేరంట్రీగా బతుకుతాడూ, బయంనేదు'' అన్సెప్పారుగా పూజారిగోరూ...'' తనలోని భయాన్ని కప్పిపుచ్చుకుంటూ, భార్యకు ధైర్యం చెప్పాడు అరిచ్చంద్రుడు.

ఇంతలో బాబాగారి శిష్యులు భక్తులకి సూచనలిస్తూ వచ్చి, కాటికాపరి అయిన అరిచ్చంద్రుడ్ని గుర్తించి, కస్సుమంటూ, వాడిలాంటి నీచ జన్ముడికి బాబాగారు విభూతి యివ్వరని, పొమ్మని కసిరారు. భక్తుల్లో చాలామంది కూడా చీదరించుకుంటున్నారు.



ఏదైనా హాస్పిటల్‌కి తీసుకుపొమ్మని కొందరు సలహా యిచ్చారు.

దంపతులు దుఃఖానికి లోనవుతూ, తమ చేతుల్లో చిల్లిగవ్వ లేదని, అందుకనే ఆఖరి ఆశగా యిక్కడకు తీసుకొచ్చామని చెప్పారు.

''అరె, అంటరాని వెధవలు- మీకు బాబాగారి చేతుల మీదుగా విభూతి పొందే అర్హత లేదంటే వినిపించుకు చావరేం? ఇక్కడ్నుంచి పొండిరా దౌర్భాగ్యుల్లారా- బాబాగారొస్తే మామీద కోప్పడతారూ''

అంటూ ఒక శిష్యుడు కసిరితే, మరొక శిష్యుడు, భక్తులను రెచ్చగొడ్తూ, ''ఈ నీచులు యిక్కడున్నారంటే, బాబాగారు ఈవాళ ఎవ్వరికీ దర్శనం యివ్వరు తర్వాత మీయిష్టం'' అని బెదిరించాడు.

దాంతో కొందరు భక్తులు అరిచ్చంద్రుడ్ని, దుర్గిని నోటికొచ్చినట్టు తిడ్తూ, కొట్టినంత పనిచేశారు.

బెదిరినప్పటికీ, కదలలేదు దంపతులు. అయినా భయపడి, పారిపోయి చేసేదేముంది? చేతిలో చిల్లిగవ్వలేదు. కొడుకా క్షణం క్షణం క్షీణించిపోతున్నాడు.

శిష్యులు తరిమికొస్తున్నా- దయగల బాబాగారు తమ పిల్లాడి పరిస్థితి గమనిస్తే, తప్పక కరుణించి విభూతి యిస్తారు అనే ఆశతో తిట్లు, చివాట్లు, శాపనార్థాలు భరిస్తూ అలాగే నిలబడుతున్నారు.

ఇంతలో- బాబాగారొస్తున్నారన్న కలకలం.

జనం మునివ్రేళ్లమీద నిలబడి, మోరలు చాచి, కళ్ల ప్పగించి చూస్తున్నారు. జనాన్ని వత్తిగించుకుంటూ ముందుకెళ్లడానికి సాహసించలేకపోతున్నారు అరిచ్చంద్రుడు, దుర్గి. అంటరాని వాళ్లయిన కారణంగా జనాన్ని తోసుకుంటూ పోయే అలవాటే లేదు మొదట్నుంచీ.

తెల్లని ధగధగ మెరిసే దుస్తుల్లో దర్శనం యిచ్చారు బాబా. ఆపైన చిరు దరహాసంతో అందరికీ అభయం చూపిస్తూ కూర్చోమని సంజ్ఞ చేశారు.

మిన్నుముట్టే జయజయధ్వానాలయ్యాక, తమ వంతు పిలుపుకోసం ఆశగా ఎదురుచూస్తూ భక్తులంతా కూర్చున్నారు.

ఎంపిక ప్రకారం పెద్ద లొక్కొక్కరికే పిలుపురావడం, వాళ్లు వెళ్లి, ముడుపులు పళ్లెంలో వేసి, బాబాగారి చేతుల మీదుగా విభూతినందుకుని, దానిని భక్తితో కళ్లకి అద్దుకుని, భద్రపరుచుకోవడం జరుగుతోంది...

చాలా నెమ్మదిగా జరుగుతోంది తంతు...

ఈ లెక్కనే సాగితే ఈరోజుకి బహుతక్కువ మంది అదృష్టవంతులకే విభూతి దక్కేలా వుంది... తమ చేతుల్లో గుంటడు బిగుసుకుపోతున్నాడు క్రమేపీ...

ఇంక ఆలస్యం చేస్తే వాడు చెయ్యి దాటిపోవడం ఖాయం అనే భయం కమ్మేస్తూంటే... భయం తెగింపుగా మారడంతో, ''అయ్యా బాబాగోరూ! దండాలు మాపైబో- కరుణించి, కూంత ముందు మా గోడినిపించుకోండి మాపైబో...''అని గొంతు చించుకుని, పెడబొబ్బ పెట్టేసాడు అరిచ్చంద్రుడు.

అదిరిపడి, అర్ధనిమీలిత నేత్రాలని ఒఖ్ఖసారిగా విప్పార్చి, చటుక్కున తల త్రిప్పి చూసారు బాబా- 'తన గోడు ముందు వినిపించుకోవాలని అంత సాహసంగా అరిచిన పొగరుబోతు ఎవరు' అన్నట్లు.

శిష్యులు బెదిరిపోతున్నారు- తర్వాత తమకు దక్కబోయే శిక్షని తలుచుకుంటూ.

"కాటికాపర్ని మాప్రైబో. కన్నబిడ్డ కల్లు తేలేత్తున్నాడు. కరునించి బేగ యింత యిబూది యివ్వు మా ప్రైబో... మాకొక్కగానొక్క నలుసు... ఆడుకల్లెదురుగా సచ్చిపోతూంటే కడుపు తరుక్కుపోతూంది మా ప్రైబో..."అని పేగులు తెగిపోయేలా ఏడుస్తూ, వణికే గొంతుతో మొరపెట్టుకున్నాడు అరిచ్చంద్రుడు. భోరున ఏడుస్తూ రెండు చేతుల్తో బిడ్డని బాబాకి కనిపించేలా ఎత్తిపట్టుకుంది దుర్గి.

బాబా కళ్ళు క్షణాల్లో ఎర్రగా కాలాయి. చింత నిప్పులే అయ్యాయి. చూపు శిష్యులవైపు తిరిగింది.

గజగజ వణికిపోయారు శిష్యులంతా.

వాళ్లను పంపించెయ్యడానికి తాము చేయని ప్రయత్నం లేదని కాళ్లమీద పడ్డారు.

బాబా కొంత శాంతించినట్లు కనిపించగానే, వాళ్లను ఏవిధంగానైనా అక్కడ్నుంచి తరిమెయ్యడం బాబాగారి అభిమతం అన్నట్లుగా శిష్యులనుంచి భక్తులకు ఆజ్ఞలు ప్రసరించాయి. ప్రచండ కోపంతో కొందరు భక్తులు అరిచ్చంద్రుడ్ని, దుర్గిని జుట్లు పట్టుకుని, తన్నుతూ, కనుచూపు మేరలో కనిపించనంత దూరానికి నెట్టుకెళ్లి, వదిలిపెట్టడం జరిగిపోయింది.

క్రమేపీ శాంతించారు బాబాగారు.

ఆ తర్వాత ప్రశాంత వాతావరణంలో బాబాగారి ప్రవచనాలు సాగాయి. జీవన్మరణ రహస్యాల గురించి ప్రబోధించిన బాబా- తను మరో నలభయి సంవత్సరాల తర్వాత కార్తీక మాసం మొదటి సోమవారంనాడు అవతారం చాలిస్తానని, తన చితాభస్మాన్ని హిమాలయాల్లో చల్లమని తన శిష్యులని ఆదేశించి వుంటానని వుద్ఘాటించారు. తన మరణాన్ని కూడా శాసించు కోగల బాబాగారికి భక్తులంతా గొంతెత్తి జేజేలు పలికారు.

సభ ముగిసింది.

అయితే- అప్పుడే ఎవ్వరూ వూహించని ఓ వింత జరిగింది.

అందరినీ అభయ ముద్రతో ఆశీర్వదిస్తూ లేచిన బాబా- ఒఖ్ఖసారిగా గుండె వత్తుకుంటూ, "అబ్బా" అంటూ మళ్లీ కూర్చుండిపోయారు.

కంగారుగా చూసారు శిష్యులు, భక్తులు.

తిరిగి, అందరికీ అభయం చూపుతూ లేచిన బాబా "అమ్మా"అంటూ మూలుగుతూ, ఈసారి నేల మీదకు ఒరిగిపోయారు.

సభలో హాహాకారాలు చెలరేగాయి.

... ... ... ...

మర్నాడు-

బాబాగారికి దహన సంస్కారం చాలా భారీ ఎత్తు ఏర్పాట్లతో జరిగింది. రాష్ట్ర రాజధాని నుంచీ, దేశ రాజధాని నుంచీ కూడా ఎవరెవరో రాజకీయ పెద్దలు కూడా విచ్చేసారు.

కనీ వినీ ఎరుగని రీతిలో తతంగం ఘనంగా జరిగిపోయింది.

... ... ... ...

మూడోనాడు-

బాబాగారి కోరిక, ఆజ్ఞల ప్రకారం హిమాలయ పర్వతశ్రేణుల్లో జల్లడానికి వారి చితాభస్మాన్ని తీసుకోవడానికి వారి శిష్యబృందం, మరి కొందరు ఊరిపెద్దలు స్మశానానికి చేరారు.

అప్పటికే సిద్ధంచేసి వుంచిన కలశాన్ని బాబా శిష్య బృందానికి అందిస్తూ, అరిచ్చంద్రుడు దుఃఖంతో కంపించిపోతూ, ఆపుకోలేక ఒఖ్ఖసారిగా బావురుమన్నాడు.

విస్తుపోయారంతా!! కాటికాపరి ఏడవడమా- ఒకరి మరణాన్ని తలుచుకుని?!! అందులో బాబాగారి దహన సంస్కారానికి బాగా ఎక్కువగా ముట్టినందుకు సంతోషించాలి గాని, ఏడవడం...!??



"...నాను అంటరానోడ్ని- నన్ను తాకరు బాబాగారు. కాని, అసుంటి మహాత్ముడ్ని తలగబెడ్తూ, ఆరి శవం పూర్తిగా కాలడానికి నా యీ సేతుల్తో ఆర్ని ముట్టుకుని, పట్టుకుని, ఇటు ఈడ్చాను, అటు ఈడ్చాను, కర్రలతో పొడిసాను, కొరకంచుతో కుమ్మాను. బతికున్న నన్ను ఆరు ముట్టుకుంటే ఆరికి పాపం తలుగుద్దంటారు, సచ్చిపోయినా ఆరిని నేను తలగబెడ్తే నాకు పున్నెం వచ్చుద్దంటారు, ఏటండీ యింత?!"

దుర్గి భర్త పరిస్థితి గమనించి, పరుగెత్తుకొచ్చి, అరిచ్చంద్రుడి వీపు నిమరసాగింది.

వాళ్ల కొడుకు దూరంగా గంతులేస్తూ ఆడుకుంటున్నాడు అమాయకంగా. అరిచ్చంద్రుడు నెమ్మదిగా కలవాన్ని నేలమీదకు దించి, మోకాళ్లమీద కూలబడుతూ, "ఏటండీ ఈ యింత?! ఇహనో ఉప్పుడో సచ్చిపోతాడనుకున్న ఈ బుడ్డోడు లేడి పిల్లలా లెగిసి, ఆడుకోడం ఏటీ- తన సావుని తనే ఆగ్నాపించగల సత్తా వున్నా బాబా గోరిట్టా అందరూ సూత్తండగనే గుటుక్కుమని ముంతడు బూడిదైపోడం ఏటీ?! ఇదేం మాయండీ?"అంటూ నాభి కదిలేంతగా కుసిళ్లతున్నాడు.

తెల్లబోయి బొమ్మల్లా చూస్తున్నారంతా.

"... అదేం మాయో, ఇస్సిత్రవోఁ- సచ్చిపోతాడూ ఇక నాబంనేదనుకున్న బుడ్డోడ్ని 'యింకెట్టాగూ యీడ కప్పెట్టేదేకదా'ని తీసుకొచ్చిన ఎంటనే వొచ్చేసాయి మూడు శవాలు వరసగా. ఓ శవం ఓ ఏశ్యది. ఓ శవం ఓ దొంగోడిది. ఓ శవం ఓ కుష్టురోగపోడిది. పెపంచకం దుష్టిలో ఆ ముగ్గురు పాపిష్టోళ్లు- కాని మాకు ఆళ్లే దేవుల్లయ్యారు. ఆ శవాల్ని కాలిత్తే వొచ్చిన డబ్బుల్తోటే మా బుడ్డోడికి పైవేటు డాకటరు కాడే సేయించాం వయిద్దెం. గంటలో మా బిడ్డ పువ్వులా లెగిసాడు..." ఊపిరందడానికి ఆగాడు ఓ క్షణం, అరిచ్చంద్రుడు.

చలన రహితంగా చూస్తూ, వింటున్నారంతా.

"... తన సేత్తో బాబాగోరు నాకు సిటికెడు ఈబూది యివ్వనేదు. కానీ- నా యీ పాపిష్టి సేతుల్లో బాబాగారు బుట్టెడు బూడిదయిపోనారు..." దుఃఖంతో గొంతు పూడుకుపోతోంది- అదిరిపడ్డారు శ్రోతలు!!

"...నాను అంటరానోడ్ని- నన్ను తాకరు బాబాగారు. కాని, అసుంటి మహాత్ముడ్ని తలగబెడ్తూ, ఆరి శవం పూర్తిగా కాలడానికి నా యీ సేతుల్తో ఆర్ని ముట్టుకుని, పట్టుకుని, ఇటు ఈడ్చాను, అటు ఈడ్చాను, కర్రలతో పొడిసాను, కొరకంచుతో కుమ్మాను. బతికున్న నన్ను ఆరు ముట్టుకుంటే ఆరికి పాపం తలుగుద్దంటారు, సచ్చిపోయినా ఆరిని నేను తలగబెడ్తే నాకు పున్నెం వచ్చుద్దంటారు, ఏటండీ యింత?!"- చీదాడు.

దిమ్మెరపోయి, కేవలం శ్రోతలుగానూ, ప్రేక్షకులుగానూ మాత్రమే మిగిలిపోయారంతా.

"... నా కొడుకు పేణాలు నిలబెట్టిన ఆ మూడు శవాలనీ తలగబెట్టిన గట్టు మీదే మరి బాబాగోరి శవాన్నీ తలగబెట్టానే- ఆళ్లు బూడిదయినట్టే ఈరూ బూడిదయ్యారే- ఈ సితాబస్మంలో ఆ శవాల తాలూకు బూడిద కూడా ఇంతో అంతో కలిసే వుంటదే- మరి, పున్నాత్ముడైన బాబాగోరి బూడిదని ఏరు సెయ్యడం ఎట్టాగండీ... అదీ నా బాధ..."

అతని ఒక్కొక్క మాట ఉక్కిరిబిక్కిరి చేస్తూంటే, ఊపిరి అందడం కష్టంగా వుందందరికి.

భర్తని ఓదార్చుతూ, తను కళ్ళు తుడుచుకుంటూ, గద్గదికతో అంటోంది దుర్గి, "ఏటో ఆ పరవేస్సరుడి మాయ- ముస్టోల్లయినా, రాజ్జాలేలే మారాజులయినా, ఎంతో పున్నాత్ములనిపించుకునే గొప్పోరు అయినా, ఓరయినా సరే- సివరాకరికి, ఇదుగో, పాపిస్టోడనిపించుకునే నా పెనిమిటి ముందు నోరు మెదపకుండా అట్టా పడుండాలని ఏ దేవుడు శాపవోఁమరి... ..."

కాళ్ల క్రింద భూమి కొద్దిగా కంపిస్తున్నట్లుగా భావన కలుగుతూన్న బాబా శిష్యుల శరీరాల్లో క్రమేపీ చలనం, మస్తిష్కాల్లో సంచలనం, ఏదో కనువిప్పు కలుగుతూన్న భావన, ఇన్నాళ్లూ బాబా శిష్యులుగా తాము ఎంతో నేర్చుకున్నామనుకున్న విద్యలోని డొల్లతనం,... వీటన్నిటి లోంచి ఉద్భవిస్తోందో ప్రశ్న...

'ఎన్ని పురాణాలూ, శాస్త్రాలూ చదివీ కూడా మనం- ప్రాణంపోయాక మన 'శవ దహన సంస్కారా'నికిచ్చే విలువ ప్రాణముండగా మనలోని 'కుసంస్కార దహనాని'కి ఎందుకివ్వలేకపోతున్నాం?!'

- అప్రయత్నంగా ముకుళించిన వాళ్ల చేతులు అరిచ్చంద్రుడు దంపతుల వైపు భక్తి పూర్వకంగానూ, కృతజ్ఞతా పూర్వకంగానూ లేచాయి. పార్వతీ పరమేశ్వరులే సాక్షాత్కారమయిన అనుభూతిని పొందుతున్నారు వాళ్లు.

★